క్లుప్తంగా

ప్రతిభ చూపిన క్రీడాకారులకు సన్మానం



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న నేతలు

గూడూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్విమ్మింగ్, యోగాలో రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన విద్యార్థినిలను గురువారం ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ కంటి రామ్మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి సన్మానించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. హెచ్ఎం మాధవిలత పాల్గొన్నారు.

మట్టి తరలింపు ట్రాక్టర్ల పట్టివేత

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలపై బాలాయపల్లి ఎస్ఐ వీరనారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కయ్యూరు గ్రామ పరిసర ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు కయ్యూరు గ్రామ శివారు నుంచి పచ్చారుచేను గ్రామానికి అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారమందిందన్నారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 1 జేసీబీ, 3 ట్రాక్టర్‌లు స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీఆర్వో మేకలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇంటికే..



సిబ్బందిని ప్రశ్నిస్తున్న దయాకర్

సైదాపురం: రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇంటికే పంపుతామని విచారణాధికారి, జిల్లా ప్రోగ్రాం అధికారి పీఎల్ దయాకర్ హెచ్చరించారు. సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరుపై గురువారం క్షేత్రస్థాయిలో ఆయన విచారణ చేశారు. ప్రధానంగా సిబ్బంది రోగులతో వ్యవహరించే తీరు మార్చుకోవాలంటూ ఆయన సిబ్బందికి సూచించారు. సిబ్బంది పనితీరుపట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని వైద్యుడికి మెమో జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చోరీ కేసులో ఆరుగురు అరెస్ట్

చిల్లకూరు: మండలంలోని బెస్తపాళెం సమీపంలోని రొయ్యల గుంతల వద్ద పైపులు చోరీ చేసినట్లు వారం క్రితం గుంత యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేసి పైపుల చోరీ స్థానికంగా ఉన్న వారి పనే అని గుర్తించారు. ఈ క్రమంలో అంకులపాటూరుకు చెందిన ఆరుగురిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

యూటీఎఫ్ బలోపేతానికి చర్యలు

కోట: యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం గురువారం కోట హైస్కూల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు హాజరయ్యారు. యూటీఎఫ్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మస్తానయ్య, రమేష్ పాల్గొన్నారు.

వీఆర్వో మృతికి తహసీల్దార్ సంతాపం



వీఆర్వో మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ లాజరస్, రెవెన్యూ సిబ్బంది

ఓజిలి: మండల పరిధిలోని పున్నేపల్లి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న కాపులూరు యూహానయ్య గుండెపోటుకు గురై మృతి చెందడంతో తహసీల్దార్ లాజరస్ గురువారం సంతాపం తెలిపారు. నాయుడుపేట మండలం కాపులూరు గ్రామానికి చేరుకుని వీఆర్వో మృతదేహం వద్ద నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి నగదు సాయం చేశారు. అనంతరం మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రెవెన్యూ సిబ్బంది వీఆర్వో మృతదేహానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు

పెళ్లకూరు: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 1,820 మంది చిన్నారులకుగాను కేవలం 538మందికి మాత్రమే ఆధార్ ప్రక్రియ పూర్తిచేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన సమయానికి లక్ష్యం పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

స్వర్ణ కలశాలకు శాస్త్రోక్తంగా అభిషేకం



స్వర్ణ గోపుర కలశాలకు పూజలు చేస్తున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులు, ఆలయ చైర్మన్ బాలచంద్రారెడ్డి దంపతులు

సూళ్లూరుపేట: ఆంధ్రా–తమిళనాడు భక్తులకు ఆరాధ్యదైవం సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతన సువర్ణ గోపుర కలశ ప్రతిష్ట మహాకుంభాభిషేకం మహోత్సవం రెండోరోజున గురువారం స్వర్ణ గోపుర కలశాలకు వేదపండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా అభిషేకాలు చేశారు. అనంతరం యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతి దంపతులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి దంపతులు యాగంలో కూర్చుని 16 స్వర్ణ గోపుర శిఖర కలశాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. విఘ్నేశ్వరపూజ, గవ్యాస్తం, కైలాస మండపారాధన, త్రిశూలపూజ, నవగ్రహ మండపారాధన, శాంతి కుంభావాహన, క్షీరాదివాసం, బలిహోమం, షడ్రచ హోమం, దిశా హోమాలు నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మళ్లీ సాయంత్రం యాగశాలార్చన ప్రధాన కుంభస్థాపన, పుష్పాదివాసం, వస్త్రాదివాసం, పంచశయ్యాదివాసం, చతుర్వేద పారాయణం, పురాణ పఠనం, అంగహోమం, ప్రత్యంగహోమం, కళాహోమం, దేవి అష్టాతింశకళాహోమం, చతుర్నవతిహోమం, రుద్రహోమం, దుర్గాహోమం, చెంగాళమ్మ మూలమంత్రహోమం, శాలాంగహోమాలను నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి 8.27 గంటలకు వేమిరెడ్డి దంపతులు స్వర్ణ విమానగోపుర శిఖర ప్రతిష్ట కుంభాభిషేకాన్ని నిర్వహించనున్నారు. 16 స్వర్ణ శిఖరాల ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులంతా పెద్ద ఎత్తున విచ్చేసి అమ్మవారి కృపా కటాక్షములకు పాత్రులు కావాలని చైర్మన్ బాలచంద్రారెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి కోరారు.

మార్కెట్‌లో అవసరమైన మౌలిక వసతులు



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

– ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: పట్టణంలోని ఐసీఎస్ రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని సొసైటీలో ఉన్న ఎమ్మెల్యే నివాసంలో గురువారం కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. వ్యాపారులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కూరగాయల మార్కెట్ మరో రెండు నెలల్లో పూర్తి అవుతుందన్నారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలకు పార్కింగ్, టాయిలెట్ బ్లాక్ ఏర్పాటు చేస్తున్నామని, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో వ్యాపారాలు చేస్తున్న వారందరికీ అవకాశం కల్పిస్తామని, అలాగే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ఫుట్‌పాత్‌లపై కూరగాయలు అమ్ముకుంటున్న వారికి కూడా తగిన విధంగా అవకాశం కల్పిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేత బత్తిని విజయకుమార్, బీసీ విభాగం అధ్యక్షుడు తాళ్లూరు శ్రీనివాసులు, గోపాల్ యాదవ్, అజీజ్, నరసయ్య పాల్గొన్నారు.

జేఎస్ఏపీ క్రికెట్ పోటీలు

వెంకటగిరి: పట్టణంలోని తారకరామా క్రీడా క్రికెట్ ప్రాంగణంలో జేఎస్ఏపీ తిరుపతి జిల్లా విభాగం ఆధ్వర్యంలో గురువారం క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. శివ– శీను జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శీను జట్టు విజయం సాధించింది.

కలిసికట్టుగా విజయానికి కృషి



మాట్లాడుతున్న మన్నారపు రవికుమార్

సైదాపురం: సమష్టి కృషితో మండలంలో వైఎస్సార్‌సీపీ పార్టీ విజయానికి కృషిచేద్దామని మండల జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్ పిలుపునిచ్చారు. సైదాపురంలో గురువారం మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3న వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ గురుమూర్తి, జిల్లాలోని పార్టీ ప్రముఖ నేతలు పాల్గొంటారని ఆయన అన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నేతలు దాసరి రాజుశంకర్‌రాజు, వి.ప్రభాకర్‌రెడ్డి, చెమిర్తి జనార్దన్‌రాజు, టి.భాస్కర్, ఎన్ రాంగోపాల్‌రెడ్డి, అబ్బిరాజు, జి.రాఘవరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు

నివేదికను కలెక్టర్‌కు అందజేస్తా!

చిల్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో నిధుల వినియోగంపై వచ్చిన ఆరోపణలపై గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ గూడూరులోని తన కార్యాలయంలో గురువారం మండల అధికారులను విచారణ చేశారు. గతంలో వచ్చిన తుపాన్ సమయంలో పారిశుద్ధ్యం నిర్వహించినట్లు చిల్లకూరు మండల పరిషత్ నుంచి నిధులు డ్రా చేసి పనులు చేయకుండానే రికార్డుల్లో నమోదు చేసినట్లు ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ గూడూరు ఆర్డీఓను విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో మండల పరిషత్ సిబ్బందితో పాటు పలు పంచాయతీల కార్యదర్శులను కార్యాలయానికి పిలిపించి నిధులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రతి ఒక్కరిని విచారణ చేసి ఆర్డీఓ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ఆయన పూర్తి నివేదికను సిద్ధంచేసి జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిసింది. నిధులు పక్క దారి పట్టినట్లు రుజువు అయితే మండల పరిషత్ అధికారులపై వేటు పడే అవకాశాలు ఉన్నాయి.

చురుగ్గా జగనన్న భూసర్వే



సర్వే పనులను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రముని

తడ: జగనన్న భూసర్వే పనులు మండలంలో చురుగ్గా సాగుతున్నాయని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని తెలిపారు. ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంఎల్‌సీ ఎన్నికల పోలింగ్‌స్టేషన్‌ని పరిశీలించారు. అనంతరం తడకండ్రిగ పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలను పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్డీఓ తెలిపారు. పక్కా ఇళ్ల నిర్మాణం నాణ్యతలో రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మండలంలోని తడకండ్రిగ, వేనాడు, ఇరకం, బీవీ పాళెం పంచాయతీల్లోని వ్యవసాయ భూములకు సంబంధించి సర్వే పూర్తయిందని తెలిపారు. ఆర్డీఓతోపాటు తహసీల్దార్ రామయ్య, సర్వేయర్ నాగరాజు ఇతర అధికారులు ఉన్నారు.

నెల్లూరు పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడి ఎంపిక

కలువాయి: నెల్లూరు జిల్లా పంచాయతీరాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి ఎంపిక కావడంతో గురువారం కలువాయిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. శాలువాలు, పూలమాలలతో అనిల్‌కుమార్‌రెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు. అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసులురెడ్డి, మంత్రి కాకాణి, జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, సొసైటీ అధ్యక్షుడు చల్లా సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

గూడూరురూరల్: రోటరీ క్లబ్ 118వ వార్షికోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గూడూరు పురపాలక సంఘం కమిషనర్ తోట సాయినాథ్ అన్నారు. పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి కొళాయిని గురువారం కమిషనర్ సాయినాథ్ ప్రారంభించారు. అదేవిధంగా రెండో పట్టణ పరిధిలోని వీరారెడ్డిపల్లికి వెళ్లే మార్గంలో రాజమాత రోటరీ క్లబ్ బస్సు షెల్టర్‌ను వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రాజమాతాదేవి శిష్యులు ప్రారంభించారు. రోటరీ ప్రతినిధులు కిరణ్ చక్రవర్తి, రవికుమార్, పి.వి.కృష్ణయ్య, మునిగిరీష్, ఎన్.బాలకృష్ణంరాజు, జనార్దన్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు కరపత్రంగా ఈనాడు



మాట్లాడుతున్న పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు

వెంకటగిరి: ఈనాడు దినపత్రిక చంద్రబాబు కనుసన్నల్లో పనిచేస్తూ ఆయన పార్టీ కరపత్రంగా మారిందని పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్ బాలయ్య, దశరథరామిరెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు కోసమే ఎల్లోమీడియా పనిచేస్తోందని, పాత ఫొటోలతో పట్టాభిని కొట్టారంటూ అబద్ధపురాతలు ఈనాడు పత్రికలో మొదటిపేజీలో ప్రముఖంగా ప్రచురించి, సవరణను మాత్రం రెండో పేజీలో సింగిల్ కాలంలో వేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్ని పదవుల్లో అగ్రతాంబూలం ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వంపై బురదజల్లడమే అజెండాగా ఈనాడు కుట్రపన్నుతోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, చేనేత విభాగం అధ్యక్షుడు కాసుల శివకుమార్, జేసీఎస్ కన్వీనర్ పులిప్రసాద్‌రెడ్డి, నేతలు బండి రమేష్‌రెడ్డి, టి గణేష్‌రెడ్డి, ఎం సురేంద్ర, టి శివారెడ్డి, శంకరయ్య, పేచీరాజ్, నాగరాజు, వెంకటేశ్వర్లు, సీపీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

–ఒకరికి తీవ్రగాయాలు

వెంకటగిరిరూరల్: ద్విచక్రవాహనంపై రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలోని రాపూరు క్రాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగింది. బాలాయపల్లి మండలం కయ్యూరు గ్రామానికి చెందిన నారాయణయ్య ద్విచక్రవాహనంలో వెంకటగిరి నుంచి వస్తూ రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద ఆపి ఉన్నారు. ఆ సమయంలో రాపూరు నుంచి గూడూరు వైపు వెళ్లే లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈఘటనలో నారాణయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని స్థానికులు వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం తిరుపతి రుయా వైద్యశాలకు తరలించారు. వెంకటగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదుపు గ్రూపుల అవకతవకలపై విచారణ

వాకాడు: వాకాడు మండలం జెమిన్ కొత్తపాళెం పంచాయతీ పరిధిలోని పలు పొదుపు గ్రూపుల్లో అనేక అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై గురువారం ఆయా గ్రామాల్లో అధికారులు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ అధికారులు మాట్లాడుతూ గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాలకు సంబంధించి నెలసరి వాయిదా సొమ్మును కొన్ని సంవత్సరాలుగా గ్రూపు లీడర్లు బీజీ పాయింట్ల ద్వారా చెల్లిస్తున్నారు. ఐతే అప్పటి నుంచి చెల్లించిన వాయిదాలకు సంబంధించి రసీదులు ఇవ్వకపోవడంతో సొమ్మును వీఓఏలు స్వాహాచేశారంటూ సభ్యుల ద్వారా ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేసి అసలు విషయాన్ని బయట పెడతామన్నారు. ఏపీఓ కృష్ణ, సీసీ సుబ్బయ్య పాల్గొన్నారు.

పరిశ్రమల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి



కలర్ ఫైన్ పరిశ్రమను పరిశీలిస్తున్న ఆర్డీఓ

గూడూరురూరల్: పరిశ్రమల్లో యాజమాన్యాలు ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా వ్యవహరించాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. మంగళపూరులోని కలర్ ఫైన్ కంపెనీలో ప్రమాదాల నివారణకు సంబంధించిన మాక్‌డ్రిల్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎవరికైనా ప్రమాదం సంభవిస్తే వారిని ఎలా ఆస్పత్రికి తరలించగలరు అనే విషయాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అలాగే అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది చేసే విన్యాసాలను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు



చింతపూడిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

పెళ్లకూరు: ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనుల్లో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. చింతపూడి గ్రామంలో గురువారం జరుగుతున్న ఫారంపాండ్స్ పనులను ఆయన పరిశీలించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తి కావస్తుండడంతో కూలీలందరికీ ఉపాధి పని కల్పించి వలసలు నివారించాలన్నారు. పలు ప్రాంతాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా పనుల బాధ్యతను మేట్లకు అప్పగించి సొంత పనులు చేసుకుంటున్న ఎఫ్ఏలు స్వచ్ఛందంగా నిలిచిపోవాలని ఆయన సూచించారు. పనుల ప్రదేశంలో కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ దయానంద్, టీఏ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపీ హత్యకేసులో పదిమంది అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలియజేస్తున్న గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

వెంకటగిరి: డక్కిలి మండలం మోపూరు రోడ్డు సెంటర్‌లో వైద్యశాల నిర్వహిస్తున్న వెంకటగిరి పట్టణం పీర్జాతీ పేటకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ఎస్‌కే సంధానిబాషాను డక్కిలి మండలం లింగసముద్రం రోడ్డు వద్ద వైద్యశాల నిర్వహిస్తున్న మరో ఆర్ఎంపీ వైద్యుడు బి మునిప్రకాష్ వృత్తిపరమైన కక్ష్యతో పక్కా ప్రణాళికతో మరో 9 మందితో కలిసి హత్య చేయించినట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ హత్యకేసులో ప్రధాన నిందితుడు అయిన బి మునిప్రకాష్‌తోపాటు నిందితులు తుపాకుల సుబ్రమణ్యం, జే అనీల్‌కుమార్, ఎస్ ప్రేమ్‌కుమార్, జి శోభన్, బి మునిప్రసాద్, టి అనీల్‌కుమార్, ఏ తేజ, జి సాయిసందీప్, డి మధులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సంధానిబాషా కు ప్రాక్టీస్ బాగా జరుగుతుండడం సహించలేక, ఆయనను అడ్డుతొలగిస్తే తనకు ప్రాక్టీస్ పెరుగుతుందని కుట్రతో నిందితుడు మునిప్రకాష్ సంధానిబాషాను హత్య చేసేందుకు కుట్రపన్ని నిందితుడు సుబ్రమణ్యం తిరుపతికి చెందిన జే అనీల్‌కుమార్, ఎస్ ప్రేమ్‌కుమార్‌లను మాట్లాడుకుని నలుగురు కలిసి ఈనెల 12వ తేదిన కలపాడు తెలుగుగంగ బ్రిడ్జి వద్ద హత్య చేశారని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన వెంకటగిరి సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఎస్‌కే జిలానీ, డక్కిలి ఎస్ఐ కె నాగరాజుకు తిరుపతి ఎస్పీ పి పరమేశ్వరరెడ్డి అందించిన క్యాష్ రివార్డును డీఎస్పీ ద్వారా అందజేశారు.